క్లుప్తంగా

రెండు నామినేషన్ల ఉపసంహరణ



నామినేషన్ ఉపసంహరించుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి గుడిపాటి నర్సయ్య

తిరుమలగిరి : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం తుంగతుర్తి నుంచి ఇద్దరు నామినేషన్లను ఉప సంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. నామినేషన్‌లు ఉప సంహరించుకున్న వారిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గుడిపాటి నర్సయ్య, ఇటికాల చిరంజీవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి యాదగిరిరెడ్డి, రమణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గెలిపిస్తే పార్టీలకు అతీతంగా పనిచేస్తాం



ప్రచారం చేస్తున్న సర్వోత్తమ్‌రెడ్డి

భానుపురి : ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే పార్టీలకు అతీతంగా ప్రజల కోసం పనిచేస్తామని సూర్యాపేట కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 17వ వార్డు, 33వ వార్డుల్లో వారు ప్రచారం నిర్వహించి మాట్లాడారు. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రజలను అనేక విధాలుగా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



అర్వపల్లిలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని కోమటిపల్లి, సూర్యానాయక్‌తండా, రామన్నగూడెం సర్పంచ్‌లు జాల నర్సయ్య, లూనావత్ స్వాతిరవీందర్‌నాయక్, రమావత్ పీరమ్మ, అడివెంల మాజీ సర్పంచ్ మడి పద్మతో పాటు జాజిరెడ్డిగూడెం, పర్సాయపల్లి, అడివెంల, రామన్నగూడెం, వేల్పుచెర్ల గ్రామాలకు చెందిన సుమారు 500 మంది మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అర్వపల్లిలో వారికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మందుల సామేల్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

కాసర్లపహాడ్‌లో జింక సంచారం



పత్తి చేలో తిరుగుతున్న జింక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో రెండు రోజులుగా జింక సంచరిస్తోంది. కొమ్మాల వెళ్లే తూర్పుతండా రోడ్డులో కంపసాటి గంగయ్య, కంపసాటి లింగయ్యల పత్తిచేలో జింక తిరుగుతుండగా చూసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. సమీప గుట్టల నుంచి వచ్చి ఉంటుందని, మంగళవారం కోతులు వెంట పడటంతో జింక చెట్ల పొదల్లోకి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

చివ్వెంల : రైతులు ఆరబెట్టిన ధాన్యం తీసకువచ్చి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఏ పీడీ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. నిర్వాహకులు నిబంధనల ప్రకారం తూకం వేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, సీసీ వెంకన్న పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లు పూర్తి

చిలుకూరు : కొండాపురం శివారులోని పురాతన నాగదేవత ఆలయాన్ని గ్రామస్తులు దాతల సహకారంతో రూ.50 లక్షలతో పునర్నిర్మించారు. ఈ నెల 16న నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 15వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు ఉన్నట్లు సర్పంచ్ వేనేపల్లి సుగుణమ్మ, కమిటీ సభ్యులు తెలిపారు.

అభివృద్ధిని చూసి గెలిపించండి

- తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి కిషోర్

మద్దిరాల : మద్దిరాలను మండలం చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, తనను మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్న నెమిల, గుట్టకాడి తండా, మామిళ్లమడవ, తూర్పు తండా, పీర్యాతండా, జి.కొత్తపల్లి, ముకుందాపురం, మద్దిరాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నూతన మండలాల ఏర్పాటుతోపాటు గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్ దేనని అన్నారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించినట్లయితే రూ.400కే గ్యాస్ సిలిండర్, ఎకరానికి రూ.16వేల రైతుబంధు, రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఐదు లక్షల ప్రమాద బీమా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్ఏ.రజాక్, జెడ్పీటీసీ కన్నా సురాంభ వీరన్నగౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీరాంరెడ్డి, నాయకులు మల్లు కపోతంరెడ్డి, మల్లు కళింగ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, సర్పంచ్‌లు గౌతమి రాజు, కోమలి భూక్య, లక్ష్మీ వీరన్న, అక్కిరెడ్డి జ్యోతి ఉపేందర్ రెడ్డి, ఇంతియాజ్ ఖాతున్ రజాక్, రావుల వెంకన్న, తిరుమలరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



మద్దిరాలలో ప్రచారంలో పాల్గొని బాణం ఎక్కు పెడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో నంబర్ వన్‌గా ఉందని తుంగతుర్తి శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. మంగళవారం తొండ గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమరుగొమ్ముల స్నేహలత, రైతు సమన్వయ సమితి గ్రామ కోఆర్డినేటర్ వాసిరెడ్డి గోపాల్‌రెడ్డి, గొలుసుల మల్లయ్య, సింగిల్ విండో డైరెక్టర్ బూతం రవీందర్, మహేష్, ఉమేష్, ప్రవీణ్, యాకేష్, సందీప్, గణేష్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పత్తెపురం సరిత, కందుకూరి బాబు, రమేష్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిషోర్



చిన్ననెమిలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ



చివ్వెంల : పెద్ద వెంకయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్ రెడ్డి



పెన్‌పహాడ్ : నర్సయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది డపుకు మల్లయ్య తండ్రి డపుకు పెద్ద వెంకయ్య (85) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీవన్ రెడ్డి, జెడ్పీటీసీ భుక్యా సంజీవ్ నాయక్, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కీర్తి నర్సయ్య మృతికి సంతాపం

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని చీదెళ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కీర్తి నర్సయ్య (53) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, గుర్రం అమృతారెడ్డి, మండాది నగేష్‌గౌడ్, మిర్యాల వెంకటేశ్వర్లు, తూముల ఇంద్రసేనారావు, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, కీర్తి వెంకట్రావు, సొంటి శ్రీను, గోపిరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ బీమాతో ఇంటింటికీ ధీమా

సూర్యాపేట : కేసీఆర్ బీమాతో ఇంటింటికీ ధీమా లభిస్తుందని సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సతీమణి సునీత అన్నారు. పట్టణంలోని 17వ వార్డు చింతలచెరువులో మంగళవారం ఆమె ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించి మాట్లాడారు. 11 సార్లు కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే సూర్యాపేట నియోజకవర్గానికి, ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో రైతులు కరెంట్, ఎరువులు, విత్తనాల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులకు ఆ పరిస్థితి లేదన్నారు. సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తున్నారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రైతులకు అండగా ఉన్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతు బీమా, రైతుబంధు, ఉచిత కరెంట్‌ను ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు.



పట్టణంలోని 17వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి సతీమణి గంటకండ్ల సునీత

కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు



సూర్యాపేట రూరల్ : బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న వెంకటేశ్వర్‌రావు



బీజేపీలో చేరుతున్న గోగుల రమేష్

సూర్యాపేట రూరల్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని సూర్యాపేట బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. కుసుమవారి గూడెంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజా సంగ్రామ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1200 మంది విద్యార్థుల బలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదని తెలిపారు.

బీజేపీలో 200 మంది చేరిక

కుసుమవారి గూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి సంకినేని సమక్షంలో బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు జి. లింగారెడ్డి, జై.నాగేందర్ రెడ్డి, జి.నాగయ్య, వి.నాగయ్య ఆధ్వర్యంలో సుమారు 200 మంది బీజేపీలో చేరారు.

దురాజ్‌పల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం సూర్యాపేట బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ గోగుల రమేష్, బీఆర్ఎస్ నాయకుడు కందుల రమేష్, స్థానిక 35వ వార్డు టీఆర్ఎస్ కార్యకర్తలు, కుమ్మరి సంఘం నాయకులు, తెలంగాణ జన సమితి నాయకులు, ఇమాంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ఇతర వార్డులకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంకినేని వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో నాతల వెంకటరెడ్డి, నల్లగంతుల వెంకటేశ్వర్లు, ఎండీ జాని, గోగుల వివేక్, భానోతు వీరన్న, పుట్టల దుర్గాప్రసాద్, 35వ వార్డు, 47వవార్డుకు చెందిన నాయకులు, టీజేఎస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రఫీ, యూత్ అధ్యక్షుడు అరీఫ్, షేక్ రఫియా బేగం, ఇమాంపేట గ్రామస్తులు, పట్టణంలో 7వ వార్డుకు చెందిన నాయకులు ఉన్నారు.

చివరి పోటీ.. ఒక్క అవకాశం ఇవ్వండి

ఆత్మకూర్ (ఎస్) : సూర్యాపేట నియోజకవర్గం నుంచి తాను చివరిసారి పోటీ చేస్తున్నందున ఒక్క అవకాశం ఇవ్వాలని సూర్యాపేట నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు ప్రజలకు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆత్మకూరు మండలంలోని బోరింగ్ తండా, పాత సూర్యాపేట, ఏనుబాముల, కందగట్ల, గట్టికల్, పీపా నాయక్ తండా తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి సంద్యాల సైదులు, మండల ప్రధాన కార్యదర్శి పాటి కరుణాకర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ అస్లాం, శ్రీనివాస్ రెడ్డి, సారయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

అర్వపల్లి: జాజిరెడ్డిగూడేనికి చెందిన నల్గూరి యాదగిరి, సతీష్, సరేష్‌తో పాటు కొంతమంది మంగళవారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కొప్పుల సోమిరెడ్డి, కుంభం నాగరాజు, పున్న హరిప్రసాద్, కోటమర్తి మల్లయ్య, బి.వెంకన్న, పెద్ది శ్రీనివాస్, లొడంగి నాగరాజు, కుంభం నాగరాజు, సురేష్, కమటం రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



చివ్వెంల : గుంపుల గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు



పెన్‌పహాడ్ : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు బాలకిషన్ ముండా



భానుపురి : మాట్లాడుతున్న వీరబ్రహ్మచారి

చివ్వెంల : పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు బాలకిషన్ ముండా అన్నారు. మంగళవారం చివ్వెంల మండల పరిధిలోని జి.తిరుమలగిరి, గుంపుల, అదేవిధంగా పెన్‌పహాడ్, సింగిరెడ్డి పాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల నిబంధనల ప్రకారం తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలించారు.

పెన్‌పహాడ్ : ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం వచ్చే ఓటర్లకు అధికారులు మౌలిక వసతులు కల్పించాలని ఎన్నికల పరిశీలకుడు బాలకిషన్ ముండా కోరారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఆర్ఐ మట్టయ్య, కార్యదర్శులు శివ, అఖిల్, ఎంఈఓ నకిరేకంటి రవి పాల్గొన్నారు.

తగిన ఏర్పాట్లు చేయాలి..

భానుపురి: మానసిక, శారీరక దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా సెక్టోరియల్ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూర్యాపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వీరబ్రహ్మచారి అన్నారు. మంగళవారం సూర్యాపేట ఆర్వో కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెక్టోరియల్ అధికారి, పోలింగ్ అధికారి, పోలీస్, వీడియోగ్రాఫర్‌తో కూడిన టీమ్‌లు రూట్ మ్యాప్ ప్రకారం గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ శ్యాంసుందర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, రంగారావు, మహేందర్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల ఆర్థికసాయం అందజేత



ఆత్మకూర్(ఎస్): నగదు అందజేస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరు (ఎస్) : మండల పరిధిలోని మక్తాకొత్తగూడెం గ్రామానికి చెందిన తిప్పర్తి జంపయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ఈ విషయం తెలిసిన గ్రామానికి చెందిన పలువురు వాట్సప్ గ్రూప్ సాయంతో రూ.50 వేల విరాళం సేకరించి మంగళవారం మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తిప్పర్తి గంగరాజు, బండారు వీరబాబు, తిప్పర్తి సతీష్, ఎల్లేష్, లింగయ్య, శ్యామ్ బాబు, భీమయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన చెరుకు వెంకన్న మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని తెలంగాణ ఉద్యమకారుడు, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్ సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచారి, నర్సింగ వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న చెవిటి వెంకన్న యాదవ్

మద్దిరాల : కాంగ్రెస్ ఆరు గ్యారంటీ హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీ అభ్యర్థి మందుల సామేల్‌ను గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ కోరారు. మంగళవారం మద్దిరాలలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు అవిల మల్లు యాదవ్, నాయకులు మార్తా కృష్ణమూర్తి, వాసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తాళ్లపల్లి సురేష్, రేసు లింగన్న, మామునూరి ఉపేందర్ పాల్గొన్నారు.

నూతనకల్ : బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మహేశ్వరం చంద్రకళ, వెంకటయ్య, చంద్రారెడ్డి, కళ్లెం కృష్ణారెడ్డి, సైదులు, మల్లారెడ్డి, పసుల అశోక్ యాదవ్, జటంగి గణేష్, బొడ్డుపల్లి అంజయ్య, ఇరుగు కిరణ్, జూలూరి కేశవచారి, బత్తిని వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే



మాట్లాడుతున్న కడియం రామచంద్రయ్య

అడ్డగూడూరు : తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని తుంగతుర్తి బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య అన్నారు. మంగళవారం చౌల్లరామారం, చిన్నపడిశాల, జానకీపురం, కంచనపల్లిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కడియం సోమన్న, ఇమ్మానియల్, వెంకన్న పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవం

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మంగళవారం నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణల్లో అలరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



తుంగతుర్తి : కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు



పెన్‌పహాడ్‌లోని పాఠశాలలో..



అర్వపల్లి విజ్ఞాన్ స్కూల్‌లో..



నూతనకల్‌లో..



సూర్యాపేట టౌన్ : వివిధ వేషధారణల్లో జయ పాఠశాల విద్యార్థులు



తుంగతుర్తిలోని డీఆర్ఆర్ఎం పాఠశాలలో..

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా!

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం
- భయాందోళన చెందుతున్న ఆయా గ్రామాల ప్రజలు

చివ్వెంల : చివ్వెంల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకుండా వదిలి వేయడంతో ప్రజలు భాయాందోళనకు గురవుతున్నారు.

జనావాసాల్లో అధికం..

పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పాఠశాలలు, అంగన్‌వాడీ స్కూళ్లు, ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ఇష్టా రీతిగా ఏర్పాటు చేశారు. దీంతో వీటి పక్కనుంచే రాకపోకలు చేయాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని వాల్యతండాలో ప్రభుత్వ పాఠశాల వద్ద పిల్లలకు అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మున్యానాయక్ తండాలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీతోపాటు, పశువులు ఉన్న ప్రాంతంలోనే కంచె లేకుండా ట్రాన్స్‌పార్మర్ ఉంది. దీంతో చిన్న పిల్లలతోపాటు, పశువులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతులేని నిర్లక్ష్యం..

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె నిర్మాణంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని ప్రజలు పేర్కొంటున్నారు. సమస్యను విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మున్యానాయక్ తండాలో ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



జయరాంగుడితండాలో..

కంచె ఏర్పాటు చేయాలి

"చాలా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకుండా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా కంచెలు ఏర్పాటు చేయాలి.

– మంగులాల్ నాయక్, మున్యానాయక్ తండా

సమస్యను పరిష్కరించాలి

"తండాల్లో ఇళ్ల మధ్యన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పార్మర్లకు కంచే లేకపోవడంతో భయాందోళనకు గురవుతున్నాం. సంబంధిత సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడంలేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– దరావతు నరేష్ నాయక్, సేవాలాల్ తండా